సందడిగా సరస్వతీ ప్రాంగణాలు


బుచ్చిరాజుపాలెం గవర వీధి జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలలో వేచి ఉన్న విద్యార్థులు


గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

- పాఠశాలలు తెరచుకోవటంతో విద్యార్థుల కోలాహలం
- ఆటపాటల నడుమ తొలిరోజు తరగతుల నిర్వహణ

వేసవి సెలవులు ముగియటంతో విద్యార్థులంతా ఆటపాటలకు స్వస్తి పలికారు. బుద్ధిగా బడిబాట పట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ చిన్నారుల రాకతో సందడిగా మారాయి. సెలవుల అనంతరం కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సెలవులు ఎలా గడిపిందీ.. ఏ ఊరు వెళ్లిందీ ఒకరికి ఒకరు చెప్పుకుని సంతోషం పంచుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను కుశల ప్రశ్నలు వేశారు. బాగా చదువుకోవాలని హితవు పలికారు.

గోపాలపట్నం : వేసవి అంతా ఆటపాటలతో గడిపిన చిన్నారులంతా బడి బాట పట్టారు. స్కూళ్లు తెరచుకోవటంతో విద్యార్థులు బలకా–బలపం.. పెన్నూ–పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. గురువారం సెలవుల అనంతరం పాఠశాలలు తెరచుకోవటంతో విద్యార్థులు పాత స్నేహితులను కలుసుకున్నారు. సెలవులు ఎలా గడిపిందీ ముచ్చటించుకున్నారు. సరదా కబుర్లు నెమరేసుకున్నారు.


తరగతి గదిలో విద్యార్థుల సందడి



స్నేహితులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

కళకళలు.. కేరింతలు..

విద్యార్థుల రాకతో పాఠశాలలు సందడి సంతరించుకున్నాయి. పిల్లల కేరింతలు.. హడావుడితో సరస్వతీ ప్రాంగాణాలన్నీ పూర్వ వైభవం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో విద్యార్థుల సందడి కనిపించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు తల్లిదండ్రులు విద్యార్థుల్ని తీసుకొచ్చి విడిచిపెట్టారు. వారిని ఉపాధ్యాయులు క్రమపద్ధతిలో తరగతి గదుల్లోకి పంపించటం కనిపించింది.

విద్యార్థుల బడి బాట..

మల్కాపురం : వేసవి సెలవులు ముగిసాయి. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. వేసవి సెలవులను సరదాగా గడిపిన విద్యార్థులు బడి బాట పట్టారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు జీవీఎంసీ పాఠశాలలు, అలాగే ప్రైవేట్ పాఠశాలలు గురువారం సందడి సంతరించుకున్నాయి. తొలిరోజు తరగతులు ఆటపాటలతో సాగాయి. పలు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి.


జిల్లా పరిషత్ పాఠశాలకు తరలి వస్తున్న విద్యార్థులు


గవర వీధిలో పాఠశాలకు పిల్లల్ని తీసుకొస్తున్న తల్లి

క్లుప్తంగా

ఉపాధి కార్మికుల ఆందోళన


ఐద్వా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

పరవాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్‌ను పెంచాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి కూలీల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పి.బోనంగి గ్రామంలో ఉపాధి కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాది పొడవునా పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీపి కారణంగా జీవనోపాధి కష్టంగా ఉందన్నారు. ఉపాధి పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.రమణమ్మ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, నూకరత్నం, రమణమ్మ, జయలక్ష్మి, సింహాచలం, నూకాలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పంచకర్ల జన్మదినోత్సవం


ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

పెందుర్తి: ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చీమలాపల్లి సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, జనసేన, టీడీపీ నాయకులు పంచకర్లకు శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా గ్రామ దేవతల అనుపు మహోత్సవం


కుంచాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: మండల కేంద్రంలో జోడుగుళ్ల, గోర్లవానిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతలు కుంచాలమ్మ,బంగారమ్మ అమ్మవార్ల అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అమ్మవారి సన్నిధిలో కోలాటం పోటీలు, నేల డ్యాన్స్‌లు, భారీ బాణసంచాతో అమ్మవారి ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవలో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్‌లాక్‌లు

అల్లిపురం: నో పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేయొద్దని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి అన్నారు. గురువారం ఆమె తన సిబ్బందితో కలిసి బౌడరా రోడ్డు, అచ్చియ్యమ్మపేట జంక్షన్, కొబ్బరితోట కూడలి ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించిన వాహనాలకు, నో పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన వాహనాలకు వీల్‌లాక్ లు వేశారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే వీల్‌లాక్‌లు వేస్తామని, రూ.1035 ఫైన్ వేస్తామని హెచ్చరించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తప్పవన్నారు. పోలీసులు సూచించిన చోట మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.


రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాక్‌లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మలేరియాపై అవగాహన అవసరం

మద్దిలపాలెం : మలేరియాపై అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ బద్రేకుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీని గురువారం శివాజీపాలెం, నౌకానగర్, పెదవాల్తేరు, కాగితాల వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ లుంటే దోమల ఉత్పత్తి అవకాశాలుగామారుతాయని, ఎప్పటికప్పుడు నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. జ్వరం వస్తే ముందుగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోనా వేణుగోపాల్, సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్, జీవీఎంసీ యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.


నౌకానగర్‌లో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ముడసర్లోవలో అగ్ని ప్రమాదం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్లలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. జీవీఎంసీ నిర్మిస్తున్న నర్సరీకి ఎదురుగా రోడ్ల పక్కన నిల్వున్న చెత్త, ఇటీవల జీవీఎంసీ తొలగించిన చెట్లు కొమ్మలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో ఈ ప్రాంతంలో మంటలు ఎగసిపడ్డాయి. సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పక్కన మంటలు, దట్టమైన పొగలు రేగడంతో ఏం జరిగిందోనని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.


ముడసర్లోవ వెనక రోడ్లలో ఎగసి పడుతున్న మంటలు

సెల్‌ఫోన్ షాపులో చోరీ

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల సెల్‌ఫోన్ షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. క్రైం ఎస్.ఐ. సత్యారావు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని ఛాందిని సెల్ పాయింట్ యజమాని వారణాసి శ్రీనివాసరావు రాత్రి 9 గంటల సమయంలో తన సెల్ షాపు మూసేసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం 9 గంటలకు షాపుకు వచ్చి చూసేసరికి షాపు తలుపులు తీసి ఉండటంతో అనుమానం వచ్చి చూశారు. దుకాణంలో రిపేరుకు వచ్చిన 6 సామ్‌సంగ్ సెల్‌ఫోన్‌లు, 1 వివో సెల్‌ఫోన్, 10 బ్లూటూత్‌లు పోయినట్లు గుర్తించారు. దీంతో శ్రీనివాసరావు మహారాణిపేట క్రైం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ. సత్యారావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. దగ్గరలో గల సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి షాపు లూటీకి పాల్పడినట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైవీని కలిసిన రవికుమార్


వైవీ సుబ్బారెడ్డిని కలిసిన గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని విశాఖపట్నం పార్టీ కేంద్ర కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఐడి బాబు తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం : మండలంలోని సబ్బవరం సెక్షన్–1,సెక్షన్–2 పరిధిలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ గురువారం తెలిపారు. దీంతో మండలంలోని సబ్బవరం, అంకాపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


పాలిశెట్టి జగ్గప్పారావు

అల్లిపురం: మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు నమోదయింది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఆర్ వెంకటాపురం, రామాలయం వీధికి చెందిన పాలిశెట్టి జగ్గప్పారావు కోవిడ్ సమయంలో శానిటైజర్‌కు అలవాటు పడి మానసికంగా బాధపడుతున్నాడు. అతను సాత్ జైలురోడ్డులోని పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న భువనేశ్వరి మెకానిక్ షాప్‌లో పని చేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన గాంధీ బొమ్మ దగ్గరలో గల సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్నట్లు చెప్పి సాయంత్రం 7.30 గంటల సమయంలో వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతని భార్య కళ్యాణి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త వయసు 42 సంవత్సరాలని, చామన ఛాయతో, 5 అడుగుల 7 అంగులాల ఎత్తు, చింతపిక్క రంగు ఫ్యాంటు, స్కైబ్లూ కలర్‌పై చెక్స్ షర్టు వేసుకుని ఉన్నట్లు తెలిపింది. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 8919812412 ఫోన్ నంబర్లలో తెలిపాలని కోరారు.

జైల్‌లో రక్తదాన శిబిరం


జైల్‌లో రక్తదానం చేస్తున్న అధికారులు

ఆరిలోవ: అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్ర కారాగారంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పి.ఎస్.రామచంద్రరావు, కమలాకరరావు, పలువురు సిబ్బంది రక్తదానం చేశారు.

పురటాలమ్మ విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు


విగ్రహాన్ని తీసుకొస్తున్న పూజారి వంశీయుడు లండ వెంటరమణ తదితరులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత పురటాలమ్మ నూతన విగ్రహం ప్రతిష్ట గురువారం వైభవంగా జరిగింది. పైడితల్లి అమ్మవారి ఆలయానికి సమీపంలో ఉన్న పురటాలమ్మ సన్నిధిలో ఉదయం నూతన విగ్రహ ప్రతిష్టని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ప్రతిష్ట పూజలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, పూజారీ వంశీయుడు లండ వెంకటరమణ, దేవస్థానం ఈఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ పెంచాలి

పరవాడ: గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పరవాడలో జరుగుతున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలకు ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించే విధంగా కేంద్ర రాష్ట ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించి పే స్లిప్‌లు మంజూరు చేయాలన్నారు. గతంలో కల్పించిన తట్ట, పార, గునపాం, మేట్లకు అదనంగా కూలి చెల్లించాలన్నారు. కూలీలకు టెంట్లు, మంచినీరు సదుపాయాలు కల్పించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించి మూడు వారాల బకాయి డబ్బులు చెల్లించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉపాధి పనులు పరిశీలిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

దివ్యాంగులకు అన్నదానం

సబ్బవరం: వెదుళ్ల నరవలో మంజుశ్రీ–పునీత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులు, అనాథలకు అన్న ప్రసాద వితరణతో పాటు వస్త్ర పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వెదుళ్లనరవలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బొట్టా ముత్యాలరావు కుమార్తెలు మంజుశ్రీ,పునీత్ కుమార్‌లు అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది మృతి చెందడంతో వారి స్మారకార్థం ట్రస్టు ప్రారంభించినట్లు ముత్యాలరావు తెలిపారు. దీంతో నాటి నుంచి కష్టాల్లో ఉండి ఎటువంటి అండ లేని నిస్సాహయకులకు అండగా నిలిచేందుకు ఈ ట్రస్టు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా వెదుళ్లనరవలోని తన స్వగృహంలో ముత్యాలరావు–మణి దంపతుల చేతుల మీదుగా దివ్యాంగులు,అనాథలకు అన్నప్రసాద వితరణ,నూతన వస్త్రాలతో పాటు నోట్ పుస్తకాలు, నగదు పంపిణీ చేశారు.


వృద్ధులకు, సాధువులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న ముత్యాలరావు దంపతులు

క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు


గాయపడ్డ వారి బంధువులతో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్


గాయపడ్డ వ్యక్తితో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పలువురిని కేజీహెచ్‌కు తరలించారు. వారిలో నలుగురికి కేజీహెచ్‌లో వైద్య సేవలందిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడ్డ ఆడారి నితిన్‌కుమార్ (20), కె.పవన్ (19), ఎస్.గణేష్ (30), ఈఎస్‌వీ రాజు (20)కు అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పర్యవేక్షించారు. గాయపడ్డ రాజు ప్రాథమిక వైద్యం తీసుకుని కేజీహెచ్ నుంచి పరారైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ముగ్గురికి వైద్య సేవలందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. బాధితులకు ఆర్థోపెడిక్, ఇతర జనరల్ వైద్యులు సేవలందిస్తున్నారు.

క్యాన్సర్ రోగులకు వైద్య సేవలందించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మారుమూల ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలో జరిగిన క్యాన్సర్ నివారణ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే మరికొంత కాలం పాటు ఆ వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని, ఆ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. క్యాన్సర్ రాకుండా తీసుకునే చర్యల గురించి వివరించారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, మొత్తం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు వారి పరిధిలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎస్.సమత, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త అధికారి డాక్టర్ నిర్మలగౌరి, ఏఎంసీ అంకాలజీ విభాగం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, ప్రోగ్రామ్ అధికారులు, అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన అధికారులు, గైనకాలజిస్టు, డెంటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.